క్లుప్తంగా

గుంతల రోడ్డుకు మోక్షం



గుంతలను పూడ్చిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

వట్‌పల్లి(అందోల్): ధ్వంసమై గుంతలు పడ్డ అల్లాదుర్గ్ ఐబీ నుంచి వట్‌పల్లి మీదుగా మెటల్‌కుంట వెళ్లే రహదారికి మోక్షం కలిగింది. ఈ రోడ్డు దుస్థితిపై ఇటీవల సాక్షి దినపత్రికలో 'ఈ రోడ్డెక్కితే నరకమే..'అనే శీర్షికతో కథనం ప్రచురించడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. గుంతలు పడిన చోట మరమ్మతులు చేయించారు. దీంతో వాహన దారులు సంతోషం వ్యక్తం చేశారు.

చెత్తవేస్తే జరిమానా

మున్సిపల్ కమిషనర్ తిరుపతి



నోటీసును అందజేస్తున్న కమిషనర్

జోగిపేట(అందోల్): రోడ్డుపై చెత్తవేస్తే జరిమానా విధిస్తామని అందోలు- జోగిపేట మున్సిపల్ కమిషనర్ సీహెచ్ తిరుపతి హెచ్చరించారు. గురువారం ఆయన పలు వార్డుల్లో పర్యటించారు. వ్యాపారస్తులు, గృహాలకు సంబంధించిన చెత్తను ఎక్కడబడితే అక్కడ పారబోయ వద్దని సూచించారు. పరిసరాలను అపరిశుభ్రంగా తయారుచేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. స్లాటర్ హౌస్‌ను శుభ్రం చేయాలని, మటన్ దుకాణ దారులకు నెలసరి అద్దెను నిర్ణయించి దుకాణాలను కేటాయిస్తామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్, ఆర్‌ఐ నారాయణ ఉన్నారు.

మారుతీరావు సేవలు మరువలేనివి



విద్యార్థినికి షీల్డ్ బహూకరిస్తున్న నేతలు

హత్నూర(సంగారెడ్డి): తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సొంత ఊరికి మారుతీరావు చేస్తున్న సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్లు అన్నారు. గురువారం మండల కేంద్రమైన హత్నూరలో అజయ్ మారుతీరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంక్‌ను వారు ప్రారంభించారు. విద్యార్థులకు స్కాలర్ షిప్పులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.20లక్షలతో విద్యార్థులకు స్కాలర్ షిప్పులు ఇస్తూ ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రశంసాపత్రాలు పొందిన మహిళా సమాఖ్య సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో కృష్ణ, వీరాస్వామి గౌడ్, కిష్టయ్య, దుర్గేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళల రక్షణకే షీటీమ్‌లు



మాట్లాడుతున్న ఎస్‌ఐ సోమేశ్వరి

పటాన్‌చెరు టౌన్: మహిళల రక్షణ కోసమే షీ టీమ్‌లు ఉన్నాయని అమీన్‌పూర్ ఎస్‌ఐ సోమేశ్వరి చెప్పారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం ఐల్లాపూర్ తండా పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలల హక్కులు, పోక్సో, బాల్య వివాహాలు లాంటి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరామ్, ఏఎస్‌ఐ బొజ్యా నాయక్, యాదగిరి, ఐసీడీఎస్ సుపర్‌వైజర్ జయ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

బోదకాలు వ్యాధిని నివారిస్తాం

పటాన్‌చెరు టౌన్: బోదకాలు వ్యాధిని నివారిస్తామని భానూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దీప్తి చెప్పారు. గురువారం ఎంపీపీ సమావేశ మందిరంలో అధికారులు, కార్యదర్శులతో ఫైలేరియా, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి దేవుజా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరిశంకర్ గౌడ్, ఎంఈవో పీపీ రాథోడ్, శ్రీనివాస్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం
- ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలి
- బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్



జహీరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సునీతారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఆయన దిష్టి బొమ్మను దహనం చేశారు. నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు దిష్టి బొమ్మను పట్టణంలో ఊరేగించి బస్టాండ్ వద్ద దహనం చేశారు. మహిళలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆ ఆడ బిడ్డలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నామ రవికిరణ్, గుండప్ప, విజయ్‌కుమార్, బండి మోహన్, మంజుల, పద్మజ, తట్టు నారాయణ, వెంకటేశం, నర్సింహులు, తంజీమ్, యాకూబ్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

సంగారెడ్డి రూరల్: మహిళలను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశాల మేరకు సీఎం దిష్టిబొమ్మను సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద దహనం చేశారు. రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వెంటనే మహిళా శాసన సభ్యులకు రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని లేదంటే నిరసనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, శ్రవణ్ రెడ్డి, మ్యకం విఠల్, గోవర్ధన్ రెడ్డి, రుక్మద్దీన్, అజీమ్, చింటూ, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి రూరల్‌లో.. బీఆర్‌ఎస్ శ్రేణులు

సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం

- ఎమ్మెల్యే మాణిక్‌రావు



ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చిందని, తీర్పును తాను స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 50 సంవత్సరాల నుంచి మాదిగలు చేస్తున్న పోరాటానికి తగిన ఫలితం దక్కిందని, దశాబ్దాల కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలంగాణ ఉద్యమం నుంచే బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తోందని, రాష్ట్రం ఏర్పడిన తరువాత అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ కోసం ఏకగ్రీవ తీర్మానంచేసి కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. ఇక నుంచి విద్య, ఉద్యోగ అవకాశాల్లో వర్గీకరణ ఆధారంగానే అకాశాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే తప్పుబట్టారు. సీఎం వారికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ కట్టుబడి ఉంది

జహీరాబాద్ టౌన్: ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పుఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు మాజీ మంత్రి, నియోజకవర్గం ఇన్‌చార్జి చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వర్గీకరణ కోసం ఎంతో మంది ప్రాణాలను త్యాగం చేశారన్నారు.

ఎమ్మార్పీఎస్ సంబురాలు

జోగిపేట(అందోల్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నివ్వడంతో గురువారం జోగిపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యాక్షుడు సంటెన్నోళ్ల సంజీవయ్య మాట్లాడుతూ 40ఏళ్లుగా మంద కృష్ణమాదిగ ఎన్నో ఉద్యమాలు చేశారని అవన్నీ ఇప్పుడు ఫలించాయన్నారు. కార్యక్రమంలో సంజీవులు, భూమయ్య, పెద్ద సాయిలు, మొగులయ్య, అజ్జమర్రి దాసు, శివ్వయ్య పాల్గొన్నారు.

సంగారెడ్డి టౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర అన్నారు. వర్గీకరణ సాధించడానికి కృషిచేసిన వారికి అభినందనలు తెలిపారు.

సిజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లావ్యాప్తంగా పలు మండలాల పరిధిలో ఉన్నాధికారులు గురువారం సీజనల్ వ్యాధులపై ప్రత్యేక సమావేశాలు, సమీక్షలు నిర్వహించారు. వానాకాలంలో మలేరియా, ఫైలేరియా, మెదడు వాపు, డెంగీ, చికున్ గున్యా, టైఫాయిడ్, డయేరియా, అతిసార వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని మండలాధికారులకు సూచించారు. పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు.



జహీరాబాద్ టౌన్: మాట్లాడుతున్న భిక్షపతి

జహీరాబాద్ టౌన్/సంగారెడ్డి టౌన్/రాయికోడ్(అందోల్)/నారాయణఖేడ్/ఝరాసంగం(జహీరాబాద్)/కంగ్టి(నారాయణఖేడ్): జహీరాబాద్ టౌన్‌లో మండల ప్రత్యేక అధికారి భిక్షపతి సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు నవనీత్, పృధ్వీని, ఎండీఓ మహేందర్‌రెడ్డి, సీహెచ్‌ఓలు యాదుల్లా, సత్యవతి తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి టౌన్‌లో ప్రత్యేక అధికారి కశిమ్ భగీ మాట్లాడారు. కార్యక్రమంలో మండలశాఖ అధికారులు, వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. రాయికోడ్(అందోల్)లో ఎంపీడీఓ ఎంఎం షరీఫ్, ఎంపీపీ అంజలీదేవి అల్లాపూర్ శివారులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించారు. సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి హన్మంతు పాల్గొన్నారు. నారాయణఖేడ్‌లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, కమిషనర్ జగ్జీవన్ మాట్లాడారు మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, సవితహన్మాండ్లు పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డుల్లోని మురుగుకాల్వలు, ఖాళీస్థలాలు, రోడ్లపై బ్లీచింగ్ పౌడరు చల్లారు. శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఝరాసంగంలో ఎంపీడీఓ సుధాకర్, మండల వైద్యాధికారి డాక్టర్ రమ్య సమీక్ష నిర్వహించారు. కంగ్టిలో మండల వైద్యాధికారి నాగమణి, ఎంపీడీఓ సత్తయ్య అవగాహన కల్పించారు. తాగునీరు క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఏపీఓ నర్సింహులు, గణపతి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశం



జహీరాబాద్ టౌన్: గుల్షన్‌నగర్‌కు చెందిన ఎండీ ఆసీఫ్ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఆసీఫ్ మానసికస్థితి సరిగ్గాలేనందున కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో చికిత్స చేయించారు. ఆరోగ్యం కుదుటపడడంతో పస్తాపూర్ చౌరస్తాలో జిరాక్స్ సెంటర్ పెట్టుకుని నడుపుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం లంచ్ బాక్స్ తీసుకుని షాపునకు వెళ్లిన ఆయన బార్య సానా తరసుమ్‌కు ఎక్కడా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆసీఫ్ ఆచూకీ తెలిసిన వారు 8712656763నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

రైతుబీమాకు దరఖాస్తులు

ఏడీఏ భిక్షపతి



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్ టౌన్: అర్హులైనవారు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి కోరారు. పట్టణంలోని కార్యాలయంలో గురువారం రైతుల నుంచి దరఖాస్తులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా పట్టదార్ పాస్ పుస్తకం పొంది, 18నుంచి 59 సంవత్సరాల లోపు ఉన్నవారు బీమాకు అర్హులన్నారు. అనంతరం రుణమాఫీ కానీ రైతులకు ఆయన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏఓ ప్రవీణ, వ్యవసాయ విస్తీర్ణాధికారి ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పిలుపునిచ్చారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కిరాణా వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని ఉల్లంఘిస్తే రూ.5వేల జరిమానా విధించడంతోపాటు చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్ వివేకానంద్‌తో కలిసి పలు వార్డుల్లో పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా పనులను పర్యవేక్షించారు.

ఘనంగా బోనాల పండుగ



నారాయణఖేడ్: బోరంచ నల్లపోచమ్మ ఆలయానికి బోనాలతో వస్తున్న భక్తులు

నారాయణఖేడ్/ఝరాసంగం(జహీరాబాద్): ఆషాఢమాస బోనాల ఉత్సవాలు బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో గురువారం వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. శివసత్తులు, పోతరాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సతీమణి అనుపమా రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం, పట్టువస్త్రాలను సమర్పించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో శివరుద్రప్ప, అర్చకులు శ్రీకాంత్, నగేశ్, సిద్దు స్వామి పాల్గొన్నారు. అదేవిధంగా ఝరాసంగం మండల పరిధిలోని కక్కర్ వాడ గ్రామంలో దేవతలకు బోనాలు సమర్పించుకున్నారు.



ఝరాసంగం(జహీరాబాద్): బోనాల ప్రదర్శన

హామీలను మరచిన కాంగ్రెస్ నేతలు

- సీఐటీయూ జిల్లా నేత సాయిలు



మాట్లాడుతున్న సాయిలు

జోగిపేట(అందోల్): కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నాయకులు మరచిపోయారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ఆరోపించారు. గురువారం స్థానిక యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తమ సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లాలని ధర్నాలకు వెళ్తుంటే పోలీసులు అరెస్టు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని నిర్బంధాలు పెట్టినా పోరాటాలు ఆగవని హెచ్చరించారు. కార్యక్రమంలో డి.విద్యాసాగర్, సురేశ్, ప్రభాకర్, రాములు, కష్ట మల్లేశం, షేకమ్మ, ఇందిర పాల్గొన్నారు.

గంజాయి సాగుచేస్తే కేసులు

- సమాచారం ఇస్తే రూ.25వేలు
- సీఐ చంద్రశేఖర్‌రెడ్డి



కల్హేర్: పత్తిచేనులో తనిఖీ చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్)/కల్హేర్(నారాయణఖేడ్): గంజాయి సాగు చేసిన వారిపై చర్యలు తీసుకొంటామని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్‌తో కలిసి గురువారం ఆయన పది గ్రామాలలోని పంటచేలల్లో తనిఖీలు నిర్వహించారు. మండలంలోని చౌకన్‌పల్లి, రాంసింగ్‌తండా, మెట్టుతండా, జీర్గి తండా, బోర్గి, సర్దార్‌తండా, హట్యాతండా, బాబుల్‌గావ్, ముకుందతండా, వాచుతండా తదితర శివార్లలో పత్తి, కంది, మొక్కజొన్న పంటల్లో గంజాయి మొక్కల కోసం గాలించారు. గంజాయి సాగు చేసినట్లు సమాచారం ఇచ్చిన వారికి రూ.25వేలు నజరానా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆస్తులు అటాచ్ చేస్తాం..

గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. సిర్గాపూర్ మండలం వాసర్, చందర్‌నాయక్ తండా, సూర్య తండా, బీబ్యతండా, మున్యతండాలో పత్తి, సోయ పంట చేలు పరిశీలించారు. కొత్త చట్టం ప్రకారం ఆస్తులు ప్రభుత్వానికి అటాచ్ చేస్తామని హెచ్చరించారు.

అభివృద్ధి అందరి బాధ్యత

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా మహిళాశిశు సంక్షేమశాఖ, మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి వంద రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ డీసీఈఓ ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ మహిళలు, బాలికల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్‌ఐ హరిశంకర్ ఫోక్సో, సైబర్ క్రైం, మాదక ద్రవ్యాల నిర్మూలన వంటి అంశాలను వివరించారు. అనంతరం సమన్వయ కర్త పల్లవి లైంగిక వేధింపులు, బాల్య వివాహ నిర్మూలన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంపీఓ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తల్లిపాల వారోత్సవాలు



జహీరాబాద్ టౌన్: మాట్లాడుతున్న అంజమ్మ

జహీరాబాద్ టౌన్/న్యాల్‌కల్(జహీరాబాద్): పట్టణంలోని అల్లీపూర్ సెక్టార్ పరిధిలోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ అంజమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముర్రిపాల ప్రాముఖ్యత గురించి తల్లులకు వివరించారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని, ఏడు నెలల తరువాత అదనపు ఆహారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, ఆశా వర్కర్ సైదాని, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు. అలాగే న్యాల్‌కల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో తల్లి పాల వారోత్సవాలు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలు, గర్భిణులు, బాలింతలకు పలు అంశాలపై కార్యకర్తలు అవగాహన కల్పించారు. సుఖ ప్రసవం కోసం తీసుకోవలసిన జాగ్రతల గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నిధులు మంజూరు చేయండి**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని గురువారం ఆయన కార్యాలయంలో కార్పొరేటర్ పుష్పనగేశ్ మర్యాద పూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు కాలనీల్లో సీసీ రోడ్లు, హిందూ శ్మశానవాటిక అభివృద్ధి గురించి చర్చించామన్నారు.

◆ **రుద్రయాగ పత్రికల ఆవిష్కరణ**



నారాయణఖేడ్: కాశీనాథ్ ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అయిదు సోమ వారాలు లోక కల్యాణం కోసం రుద్రయాగం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన పత్రికలను ఆలయ ఆవరణలో గురువారం అర్చకుడు మలమంచి గురురాజశర్మ ఆధ్వర్యంలో అనుపమారెడ్డి, కాంగ్రెస్ నేతలు ఆవిష్కరించారు.

◆ **ప్రభుత్వ స్థలాలను కాపాడాలి**

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా అధికారులు చూడాలని కౌన్సిలర్లు యూసుఫ్ అలీ, మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం అడిషనల్ కలెక్టర్ మాధురికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 993, 994, 630లోని భూములను కొంత మంది కబ్జాచేసి అమ్ముకుంటున్నారన్నారు. ఉన్నతాదికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ **ప్రమాణాలు పెంచేందుకు కృషి**

న్యాల్‌కల్(జహీరాబాద్): కళాశాలలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తానని హద్నూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పారు. ప్రిన్సిపాల్‌గా పనిచేసిన అశోక్ ఇతర కళాశాలకు బదిలీ కావడంతో కంగ్టి కళాశాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో లెక్చరర్లు అర్జున్, జగదీశ్, శ్రీనివాస్, స్వర్ణలత, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

◆ **మిషన్ భగీరథ పూర్తయ్యేది ఎప్పుడు?**

పటాన్‌చెరు: మిషన్ భగీరథను త్వరగా పూర్తి చేయకుంటే నిరాహారదీక్ష చేస్తానని బొల్లారం మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ వారాల గోపాలమ్మ వెంకటయ్య హెచ్చరించారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ తాగునీరు ఇవ్వాల్సిన పాలకవర్గం సంవత్సరాల తరబడి కాలయాపన చేస్తోందన్నారు. పాలకవర్గం ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మిషన్ భగీరథ్ పూర్తిచేసి రోడ్లు నిర్మించాలని ఆమె కోరారు.

◆ **హాస్టళ్లలో కనీస వసతులు కరువు**

సంగారెడ్డి టౌన్: హాస్టళ్లలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి అఖిలేష్ రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మహేశ్ మాట్లాడుతూ వట్పల్లి మండలంలోని దేవనూర్ ఎస్సీ హాస్టల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని. నాణ్యమైన భోజనం పెట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్జున్, వికాస్, సాయి పాల్గొన్నారు.

◆ **మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా అర్చన**

మునిపల్లి(అందోల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అర్చన బాధ్యతలు చేపట్టారు. గురువారం కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆరిఫా తెహసీన్ ఆరా నుంచి చార్జి తీసుకున్నారు. ఎల్బీనగర్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేసి పదోన్నతిపై వచ్చినట్లు తెలిపారు.

◆ **బదిలీలు సహజం**

వట్‌పల్లి(అందోల్): ఉద్యోగులకు బదిలీలు సహజమేనని ఎంపీడీవో శశిప్రభ అన్నారు. ఎంపీఓ యూసుఫ్, జూనియర్ పంచాయతీ కార్యదర్శిలు బదిలీపై వెళ్తున్న సందర్భంగా గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేసిన సేవలను బట్టి అక్కడి ప్రజల మనసుల్లో ఉండిపోతారన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఖాజా నాసిరుద్దీన్, తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ శంబిరెడ్డి పాల్గొన్నారు.

◆ **ఎన్‌ఏఎస్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ**

మునిపల్లి(అందోల్): బడే జాతీయ సర్వే కార్యక్రమంపై ఉపాధ్యాయులకు ఎంఈఓ దశరథ్ ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం మోడల్ స్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల విద్య స్థితిగతులను తెలుసుకోవడానికి మూడేళ్లకు ఒకసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

◆ **వాహనాల తనిఖీ**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గంగ్వార్ చౌరస్తాలో గురువారం ఎస్పీ రూపేశ్ ఆదేశాలతో జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహన యజమానులకు జరిమానా విధించారు.

◆ **పీసీబీ కార్యాలయం ఎదుట ధర్నా**

సంగారెడ్డి టౌన్: కాలుష్యం విడుదల చేస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రమేశ్ గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి**

జహీరాబాద్ టౌన్: కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని సీపీఎం నాయకులు అధికారులను కోరారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా వారు గురువారం వెంకటరమణ నగర్, నారాయణ నగర్‌లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ శివారుల కాలనీల్లో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజిరెడ్డి, సలీమోద్దీన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

◆ **రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి**

కల్హేర్(నారాయణఖేడ్): రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ నూతన్‌కుమార్ సూచించారు. కృష్ణాపూర్‌లో గురువారం ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు తమ పత్రాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

◆ **వ్యర్థాల నిర్వహణపై సదస్సు**

పటాన్‌చెరు: వ్యర్థాల నిర్వహణ – వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, ఐపీఎల్ అంతర్జాతీయ ఫోరమ్‌లపై 14వ అంతర్జాతీయ సదస్సును గీతం బిజినెస్ స్కూల్ నిర్వహించనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నిపుణులతో చర్చలు, విజ్ఞాన భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి ఈ యేడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 1వరకు ఈ సదస్సును హై బ్రీడ్ విధానంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9830044464, 8886785076 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.